సాక్షి అనకాపల్లి

ఆదివారం । 16 । జూన్ । 2024



మహాకవి శ్రీశ్రీకి నివాళి

విశాఖ: విశాఖ పౌర గ్రంథాలయంలో శనివారం మహాకవి శ్రీశ్రీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.



డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

విశాఖ:నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలు పెద్దఎత్తున చేశారు. పలు కూడళ్లలో తనిఖీలు సాగాయి.



గోవింద నామస్మరణ

విశాఖ: రుషికొండలో గల శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు.

న్యూస్‌రీల్

హోం మంత్రికి స్వాగతం



పాయకరావుపేటలో అనితకు స్వాగతం పలుకుతున్న నాయకులు

నక్కపల్లి/పాయకరావుపేట: రాష్ట్ర హోంశాఖ మంత్రిగా నియమితులై తొలిసారిగా నియోజకవర్గానికి వచ్చిన వంగలపూడి అనితకు శనివారం పాయకరావుపేట నియోజకవర్గంలో ఘన స్వాగతం లభించింది. పాయకరావుపేటలో ఆమె పాండురంగస్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ, జనసేన నాయకులు అనితను గజమాలతో సత్కరించారు. అనంతరం ర్యాలీగా ఆమె నక్కపల్లి చేరుకుని ఉపమాక వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకున్నారు. ఆమెకు స్వాగతం పలికిన వారిలో పాయకరావుపేట, నక్కపల్లి మండలాలకు చెందిన గెడ్డం బుజ్జి, తోట నగేష్, గూటూరు శ్రీను, పెద్దిరెడ్డి చిట్టిబాబు, పెద్దిరెడ్డి శ్రీను, నక్కపల్లి మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ఆఈట్ రెండో దశ ప్రవేశాలు

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సెల్ఫ్ సపోర్ట్ ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఆదివారం నుంచి రెండో దశ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు సంచాలకులు ఆచార్య డి.ఎ.నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 16 నుంచి 20 వరకు రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల అప్‌లోడ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. ఖాళీల వివరాలను ఈ నెల 21వ తేదీన వెబ్‌సైట్‌లో ఉంచుతారు. వెబ్ ఆప్షన్లు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు ఇవ్వాలి. రెండో దశ సీట్ల కేటాయింపు ఈ నెల 27న జరుపుతారు. ప్రవేశాలు పొందిన వారు ఈ నెల 28 నుంచి జూలై 4వ తేదీ వరకు నిర్ణీత ఫీజుల చెల్లించాల్సి ఉంటుంది.

నేడు యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష

మహారాణిపేట (విశాఖ): జిల్లాలో యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు రెండో సెషన్ పరీక్ష జరగనుంది. మొత్తం 9,635 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఆయా కేంద్రాల్లో వసతులు కల్పించి, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. 11 మంది రూట్ ఆఫీసర్లు, 26 మంది లైజన్ ఆఫీసర్లు, 26 సూపర్‌వైజర్లను నియమించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని డీఆర్వో మోహన్ కుమార్ ఆదేశించారు.

సామరస్యంగా మెలగాలి

- ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: ప్రశాంత వాతావరణంలో బక్రీద్ పండగ జరుపుకోవాలని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ ఆకాంక్షించారు. సోమవారం బక్రీద్ పండగ సందర్భంగా జిల్లాలో ప్రధాన మసీదులు, ఈద్గాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశామన్నారు. ముస్లిం సోదరులు కుటుంబ సభ్యులతో సంతోషంగా పండగ జరుపుకోవాలని ఆయన ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. మతసామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తప్పవన్నారు. గోవులను ఒక చోటు నుంచి మరొక చోటుకు తరలించేందుకు తగిన ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలన్నారు.
గోవులను వధించడం పూర్తిగా నిషిద్ధమని, చట్టాన్ని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అవాంఛనీయ సంఘటనలు ఉత్పన్నమయ్యే పరిస్థితులు ఉంటే ప్రజలు వెంటనే జిల్లా పోలీసు వారికి వాట్సాప్ నెంబర్ 94409 04229కు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

స్టూడెంట్ బస్‌పాస్‌ల జారీకి ఏర్పాట్లు

తుమ్మపాల: విద్యాసంస్థలు పునఃప్రారంభం కావడంతో స్టూడెంట్ బస్‌పాస్‌ల జారీకి అన్ని ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి కె.పద్మావతి తెలిపారు. అనకాపల్లి, నర్సీపట్నం బస్ స్టేషన్లలో ఉదయం 7 నుంచి రాత్రి 8 గంటల వరకు బస్‌పాస్‌లకు ప్రత్యేక కౌంటర్లు అందుబాటులో ఉండనున్నట్లు తెలిపారు. onine.apsrtcpass.in వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసి ఫొటో, దరఖాస్తు ఫారం తీసుకురావాలన్నారు. దరఖాస్తుపై విద్యాసంస్థ ప్రిన్సిపాల్ ధ్రువీకరణ చేయించాలన్నారు. అప్లికేషన్‌తోపాటు ఆధార్, విద్యార్హత పత్రాలు సమర్పించాలని ఆమె తెలిపారు.

యలమంచిలి పట్టణం కొక్కిరాపల్లి రైల్వేగేటు సమీపంలో ఓ దాబా హోటల్‌లో నాసిరకం ఆహార పదార్థాలు తయారు చేస్తున్నారన్న ఫిర్యాదుతో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. హానికరమైన రంగులు, నాసిరకం పదార్థాలు వినియోగిస్తున్నారన్న ఆరోపణతో ఫుడ్ శాంపిళ్లు తీసుకుని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. నాసిరకమైన పదార్థాలు వాడుతున్నారని తేలడంతో జరిమానా విధించారు.

యలమంచిలి పట్టణంలోని ప్రధాన రహదారిపై ఉన్న ఓ భోజన హోటల్‌లో బిర్యానీ పార్శిల్ తీసుకెళ్లిన యువకుడు ఇంటికెళ్లి తిందామని ప్యాకెట్ తెరిచి చూస్తే పాచిపోయిన వాసన వచ్చింది. నిల్వ ఉంచిన బిర్యానీగా గుర్తించి హోటల్‌కు వెళ్లి నిర్వాహకులను ప్రశ్నిస్తే వారు పట్టించుకోలేదు. పైగా నీ ఇష్టం వచ్చిన వారికి ఫిర్యాదు చేసుకో అంటూ ఆ యువకుడ్నే బెదిరించారు.

ముఖ్యంగా హైవే పక్కనున్న పలు రెస్టారెంట్లు, హోటళ్లలో ఉన్న కిచెన్లలో శుచి, శుభ్రత లోపించాయి. అపరిశుభ్ర వాతావరణంలోనే వంటలు వండుతున్నారు. నాసిరకం ఆహార పదార్థాలను అందిస్తున్నారు. వంట పాత్రలు, భోజనం చేసే ప్లేట్లు, నీళ్లు తాగే గ్లాసులు...ఇలా అన్నింటా అపరిశుభ్రత కనిపిస్తోంది. కస్టమర్లకు, నిర్వాహకులకు తరచూ గొడవలు జరుగుతున్నాయి. అయినా పట్టించుకునేనాథుడే కరువయ్యారు.

అనారోగ్యం 'కొని' తెచ్చుకునేలా...!



యలమంచిలికి సమీపంలో ఓ డాబా హోటల్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు (ఫైల్)







పైపై మెరుగులు కాదు నాణ్యత, పరిశుభ్రత ముఖ్యం

జిల్లాలో ఇలా..

పెద్ద హోటళ్లు తదితరమైనవి :	1000
కర్రీ పాయింట్లు తదితరాలు :	200
ఇతరత్రా చిన్న చిన్న టిఫిన్, ఫాస్ట్ ఫుడ్ దుకాణాలు :	450
ఏటా 20 శాతం కూడా తనిఖీలు జరగడం లేదు	
2023–24లో ఫుడ్‌సేఫ్టీ అధికారులు సేకరించిన శాంపిళ్లు :	300
కల్తీ జరిగినట్టు నిర్ధారణ జరిగితే.. రూ.5 లక్షలు జరిమానా	

- రుచి...శుచి లేని హోటల్ ఫుడ్
- జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు
- అపరిశుభ్ర పరిసరాల్లో వంటల తయారీ
- నిల్వ వంటకాలు, నాసిరకం సరుకులు
- నాణ్యతా ప్రమాణాలు పాటించని నిర్వాహకులు
- అనారోగ్యం కొని తెచ్చుకుంటున్న జనం
- అధికారుల తనిఖీలు తూతూ మంత్రం

యలమంచిలి రూరల్ : జిల్లాలోని చిన్న హోటళ్ల నుంచి పెద్ద రెస్టారెంట్ల వరకు ఎక్కడా నిబంధనలు పాటించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. కంపు కొట్టే వంట గదుల్లో వండే కల్తీ వంటకాలను ఇంపుగా వడ్డిస్తూ జనం ఆరోగ్యంతో ఆటలాడుతున్నారు. రోజుల పాటు నిల్వ చేసిన పదార్థాలు, గడువు మీరిన, కల్తీ నూనెలతో చేసిన వంటకాలతో హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు కస్టమర్లను దోచుకుంటున్నా ఫుడ్‌సేఫ్టీ అధికారులు, కార్పొరేషన్, మున్సిపల్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఏదో ఫిర్యాదు అందితే తూతూమంత్రంగా తనిఖీలు, శాంపిళ్ల సేకరణతో హడావుడి చేయడం తప్ప ఫుడ్ సేఫ్టీ అధికారులు గట్టి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దీంతో హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకుల ఆగడాలకు అడ్డుకట్ట పడడం లేదు.

కిచెన్ వైపు చూస్తే ముద్ద దిగదు...

చాలా హోటళ్లు, రెస్టారెంట్లలో కిచెన్‌లను శుభ్రంగా ఉంచడం లేదు. వంట పాత్రలు శుభ్రం చేయడానికి ప్రత్యేక చాంబర్లు ఉండవు. ఒకవేళ ఉన్నా అరకొర నీటితో పైపైనే శుభ్రం చేసి వాటిని తిరిగి వినియోగిస్తుంటారు. టేబుళ్లను క్లీన్ చేసే సమయంలో ఉదయం నుంచి రాత్రి వరకూ ప్లేట్లు, గ్లాసులను రెండు బకెట్ల నీళ్లలో ముంచేసి పని కానిచ్చేస్తున్నారు. వంట మాస్టర్లు, సర్వర్లు ఆప్రాన్లు, క్యాపులు, గ్లౌస్‌లు ధరించడం లేదు.

పాచి వంటలకు మసాలా తాళింపు...

ఇక వంటకాలకు సంబంధించి కుళ్లిన ఆహార పదార్థాలను వంటల్లో వినియోగిస్తున్నారు. మసాలా దినుసులు సైతం సరైన నిల్వ పద్ధతులు పాటించక పోవడంతో అందులో పురుగులు, బొద్దింకలు, బల్లులు, ఎలుకలు సంచరిస్తున్నాయి. అలాగే నిల్వ ఉంచిన చికెన్, మటన్‌ను పసుపులో ఉడికించి వంటకాల్లో వాడుతున్నారు. మిగిలితే మళ్లీ వాటిని ఫ్రిడ్జ్‌లో స్టోర్ చేస్తున్నారు. వాటిని మరుసటి రోజు వినియోగిస్తున్నారు. వంటలు ఘుమఘుమలాడేందుకు అందులో టేస్టింగ్ పౌడర్ వేస్తున్నారు.

కాగిన నూనె మళ్లీ మళ్లీ...

ఒకసారి వినియోగించిన నూనెను వంటకాల్లో పదే పదే వినియోగిస్తుండడంతో ప్రజలు క్యాన్సర్, ఇతర రోగాల బారిన పడే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. పదే పదే మరిగించిన నూనెతో తయారు చేసిన పదార్థాల వల్ల గుండెలో చెడు కొలెస్ట్రాల్ పెరిగి ఇబ్బందులు వస్తాయి. రోడ్డు పక్కన తోపుడు బళ్లు, బేకరీలు, కర్రీ పాయింట్లు, రెస్టారెంట్లలో సైతం ఇదే జరుగుతోంది. ఈ కారణంగానే ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో సైతం గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారు.



ఎక్కడైనా ఆహార నాణ్యతకు సంబంధించి లోటుపాట్లు గమనిస్తే ఫుడ్‌సేఫ్టీ కనెక్ట్ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.



అధికారులు సేకరించిన నమూనాలు (ఫైల్)

కల్తీ ఆహారంతో జబ్బులు

కాలం చెల్లిన మసాలాల వినియోగం, కల్తీ ఆహారంతో జీర్ణ కోశ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. నాణ్యత లేని ఆహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన పోషక పదార్థాలు అందక శరీరం బలహీనమవుతుంది. బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్స్‌తో డయేరియా, విరేచనాలు, కడుపునొప్పి, ఎసిడిటీ వంటివి వస్తాయి. కలరింగ్ ఏజెంట్‌ల వల్ల పేగు, ప్యాంక్రియాటిక్ కేన్సర్ల ముప్పు ఉంది.

– డాక్టర్ ఆర్.నిహారిక, సివిల్ అసిస్టెంట్ సర్జన్, యలమంచిలి సీహెచ్‌సీ

ఫిర్యాదు చేస్తే చర్యలు

ఫుడ్‌సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్ ప్రకారం అన్ని ఆహార విక్రయ కేంద్రాలు, ఉత్పత్తి కేంద్రాలు లైసెన్సు పొందాలి. నాణ్యత పాటించాలి. లేనిపక్షంలో తనిఖీలు చేసి చర్యలు తీసుకుంటాం. ప్రజలెవరైనా ఆహార భద్రతకు సంబంధించిన ఫిర్యాదులను ఫుడ్‌సేఫ్టీ కనెక్ట్ యాప్ ద్వారా చేయడానికి వీలుంది. ఎక్కడైనా ప్రజలు హోటళ్లు, స్వీట్స్, బేకరీలు, ఇతర తినుబండారాల దుకాణాలపై ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటాం. భారీ జరిమానాలతో పాటు లైసెన్సులు రద్దు చేయడం, క్రిమినల్ కేసులు పెట్టడం జరుగుతుంది.

– కె.సతీష్‌కుమార్, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, అనకాపల్లి

ఆరిల్లోవలో రంగురాళ్ల తవ్వకాలు



రంగురాళ్ల తవ్వకాలు జరిగినట్లు ఆనవాలు ఉన్న ప్రదేశం

గొలుగొండ: ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో ఉన్న రంగురాళ్ల క్వారీలో మళ్లీ తవ్వకాలు జరిగాయి. ఈ ప్రాంతంలో గస్తీ నిర్వహిస్తున్న సిబ్బంది శుక్రవారం తవ్వకాలు జరుగుతున్న సమయంలో ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి. ఆరిల్లోవ అటవీ ప్రాంతంలో ఏడాది క్రితం రంగురాళ్ల క్వారీ బయటపడింది. ఇక్కడ అక్రమ తవ్వకాలు జరపకుండా రాత్రి సమయంలో గస్తీ నిర్వహించేందుకు సిబ్బందిని ఏర్పాటు చేశారు. పగటి పూట బీట్ సిబ్బంది గస్తీ నిర్వహిస్తుంటారు. శుక్రవారం ఉదయం సిబ్బంది విధులు ముగించుకొని వెళ్లాక తవ్వకాలు జరిగాయో.. లేక రాత్రి సిబ్బంది ఉన్న సమయంలోనే తవ్వకాలు జరిగాయో తెలియడం లేదు. విలువైన క్యాట్ ఐ రకానికి చెందిన రంగురాళ్లు ఇక్కడ లభ్యం కావడంతో కొంతమంది తవ్వకందార్లు ఈ రంగురాళ్ల కోసం చాలా రోజుల నుంచి నిఘా ఏర్పాటు చేసుకొని తవ్వకాలు చేశారని భావిస్తున్నారు. వీరికి సిబ్బంది సహకారం అందించారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు పూర్తి స్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తే సమాచారం వచ్చే అవకాశం ఉంది.

ప్రత్యేక డ్రైవ్‌తో 'నేను బడికి పోతా'

- ఎంఈవోలు, హెచ్‌ఎంలకు ప్రత్యేక కార్యాచరణ
- జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ



జిల్లా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కమిటీ సమావేశంలో చర్చిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

అనకాపల్లి (కశింకోట): బయట ఉన్న బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించడానికి ప్రభుత్వం చేపట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి ఎం. వెంకటలక్ష్మమ్మ అధికారులను ఆదేశించారు. జిల్లా ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కమిటీ సమావేశం శనివారం సాయంత్రం డీఈవో ఆధ్వర్యంలో అనకాపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీలో ఉండే ఎంఈవో, హెచ్‌ఎంలకు పలు సూచనలు, షెడ్యూల్, రోజు వారీ కార్యాచరణ ప్రణాళికతో ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల విషయమై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా, మండల, హేబిటేషన్ కమిటీల ఆధ్వర్యంలో వచ్చే నెల 12 వరకు బడి ఈడు పిల్లలను చేర్పించడానికి డ్రైవ్ నిర్వహించాలన్నారు. మండలాల్లో ఎంపీడీవోలను సమన్వయం చేసుకొని ప్రభుత్వ ఉత్తర్వుల్లో నిర్దేశించిన మేరకు పది మంది సభ్యులతో కూడిన కమిటీ, సీఆర్‌పీలు, ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లతో తప్పనిసరిగా డ్రైవ్‌పై సమన్వయ సమావేశం నిర్వహించాలన్నారు. డ్రైవ్ నిర్వహించిన వివరాలతో ఫోటోలను వాట్సాప్ గ్రూప్‌లో పెట్టాలన్నారు. గూగుల్ స్ప్రెడ్ షీట్‌లో రోజు వారీ చేరిన పిల్లల వివరాలను నమోదు చేయాలన్నారు.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని రీ షెడ్యూల్

తాటిచెట్లపాలెం(విశాఖ): ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ పూండి–పలాస మెయిన్ లైన్, కోటబొమ్మాళి –తిలారు మధ్య జరుగుతున్న పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని గమ్యం కుదిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. ఈ నెల 17వ తేదీన పలాస–విశాఖపట్నం (07471) పాసింజర్, విశాఖపట్నం–పలాస(07471) పాసింజర్, విశాఖపట్నం –గుణుపూర్(08522) పాసింజర్, గుణుపూర్–విశాఖపట్నం(08521) పాసింజర్, విశాఖపట్నం–బ్రహ్మపూర్(18526) ఎక్స్‌ప్రెస్ రద్దయ్యాయి. ఈ నెల 18వ తేదీన బ్రహ్మపూర్–విశాఖపట్నం(18525) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

రీ షెడ్యూల్ చేసిన రైళ్లు

- సికింద్రాబాద్‌లో సోమవారం తెల్లవారు 4.30 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్– షాలిమర్ (07225) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 2 గంటలు ఆలస్యంగా ఉదయం 6.30గంటలకు బయల్దేరుతుంది.
- సికింద్రాబాద్‌లో ఆదివారం రాత్రి 11.40 గంటలకు బయల్దేరాల్సిన సికింద్రాబాద్– సంత్రగచ్చి (07234) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 4 గంటలు ఆలస్యంగా సోమవారం తెల్లవారు 3.40 గంటలకు బయల్దేరుతుంది.

సాగర తీరంలో సాయి పల్లవి


సినిమా లొకేషన్‌లో నటి సాయి పల్లవి

కొమ్మాది(విశాఖ): భీమిలి బీచ్‌రోడ్డు మంగమారిపేటలో సినిమా షూటింగ్ సందడి నెలకొంది. రామాద్రి బీచ్‌తీరంలో ఏర్పాటు చేసిన సెట్‌లో శనివారం తండేల్ అనే సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను చిత్రీకరించారు. గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై చందు మొండేటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీకాకుళంలోని మత్స్యకారుల వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ వేసిన సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. సినిమా షూటింగ్ చూసేందుకు అభిమానులు పెద్ద ఎత్తున ఇక్కడకు చేరుకున్నారు. మరో నాలుగు రోజుల పాటు ఇక్కడ ఈ సినిమా షూటింగ్ జరుగుతుందని చిత్ర యూనిట్ తెలిపింది.

ఇథనాల్ ప్లాంట్లుగా.. మూతపడిన చక్కెర కర్మాగారాలు

తుమ్మపాల: మూతపడిన చక్కెర కర్మాగారాల్లో ఇథనాల్ ప్లాంట్లను ఏర్పాటు చేసి చెరకు రైతులకు న్యాయం చేస్తామని ఎంపీ సీఎం.రమేష్ తెలిపారు. పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాల స్థాపనకు కృషి చేస్తానని, పరిశ్రమలు తీసుకువచ్చి ఉపాధి కల్పనకు స్థానిక యువతకు మొదటి ప్రాధాన్యత ఇస్తామన్నారు.

సారూ.. ఇదేం తీరు..!

'నగరానికి చెందిన హరినారాయణకు డీఎస్సీ–98 ద్వారా టీచర్(ఎంటీఎస్) ఉద్యోగం లభించింది. గతేడాది విద్యా సంవత్సరం ప్రారంభమైనందున తప్పనిసరి పరిస్థితుల్లో విశాఖ నుంచి అల్లూరి జిల్లా ఏజెన్సీలో పోస్టింగ్ తీసుకున్నారు. జులై 31న ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. తాజాగా కొనసాగింపు ఉత్తర్వులు అందినా, నెలన్నర రోజుల కోసమని కుటుంబాన్ని వదిలి అటవీ ప్రాంతానికి వెళ్లక తప్పటం లేదు. ఈ ఏడాది కాలంలో ఇలా చాలా మంది రిటైర్ అవుతున్నారు. ఏజెన్సీకి పంపించటమే కాకుండా, రూ.110లు జ్యాడిషియల్ ఒప్పంద పత్రం సమర్పించాల్సిందనే ఉత్తర్వుల్లో పేర్కొనటంపై ఉపాధ్యాయులు పెదవి విరుస్తున్నారు.'

- డీఎస్సీ–98 ఉపాధ్యాయులకు అశనిపాతం
- పాతికేళ్ల తరువాత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఉద్యోగాలు
- గత ఉత్తర్వులకు భిన్నంగా పోస్టింగ్‌లు
- రిటైర్మెంట్‌కు దగ్గరలో ఉన్నవారూ అడవిబాట
- ఆందోళనలో ఉపాధ్యాయులు. కౌన్సెలింగ్ కోసం డిమాండ్


శిక్షణతరగతుల్లో డీఎస్సీ–98 ఉపాధ్యాయులు

విశాఖ విద్య: రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులతో ఫ్రెండ్లీగా ఉంటుందని చెబుతున్నా ఆచరణలో మాత్రం మరోలా నిర్ణయాలు వెలువడుతున్నాయి. డీఎస్సీ–98 ఉపాధ్యాయుల విషయంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వులతో వచ్చే నెలలో ఉద్యోగ విరమణ చేస్తున్న వారు సైతం విశాఖ నగరం నుంచి ఏజెన్సీ ప్రాంతానిని వెళ్లక తప్పని పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వచ్చిన ఉద్యోగాలు కాబట్టి, ఎక్కడ కొలువులు ఊడిపోతాయోననే ఆందోళనతో తమ సమస్యను చెప్పుకోలేక డీఎస్సీ–98 ఉపాధ్యాయులు లోలోన మదనపడుతున్నారు.

పాతికేళ్లకు దక్కిన ఉద్యోగాలు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పాతికేళ్ల సమస్యకు మోక్షం కలగటంతో గతేడాది జూన్ నెలలో డీఎస్సీ–98 వారికి పోస్టింగ్‌లు ఇచ్చారు. మినిమమ్ టైం స్కేల్(ఎంటీఎస్) కింద నెలకు రూ.32,670లు వేతనం పొందుతున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో అర్హత సాధించిన 288 మందికి నాడు ఉపాధ్యాయులుగా పోస్టింగ్ ఇచ్చారు. అయితే విశాఖ జిల్లాలో ఖాళీలు లేవనే కారణంతో 200 మంది వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా(ఏజెన్సీ ప్రాంతం)కు కేటాయించారు.

సొంత ప్రాంతాల్లో పోస్టింగ్ ఇమ్మన్నా..

మినిమమ్ టైం స్కేల్ కింద పనిచేస్తున్నందున స్థానిక నివాసాలకు సమీపంలో పోస్టింగ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలని 15–06–2023న పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సైతం ఉత్తర్వులు జారీ చేసినా, విశాఖ జిల్లాలో ఖాళీలు లేవని విద్యాశాఖాధికారులు తెలుపటంతో, తప్పనిసరి పరిస్థితుల్లో డీఎస్సీ–98 ఉపాధ్యాయులు ఏజెన్సీ ప్రాంతానికి వెళ్లారు. ఈ ఏడాది తమకు న్యాయం చేస్తారని అంతా భావించారు.

కౌన్సెలింగ్ కోసం ఆరాటపడినా..

డీఎస్సీ–98 కాంట్రాక్టు టీచర్స్‌కు 2024–25 విద్యా సంవత్సరంలోనూ కొనసాగిస్తూ తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. డీఎస్సీ–2008 వారితో కలిపి అందరినీ 11 నెలల కాలానికి విధుల్లోకి తీసుకుంటూ, గత ఏడాది పనిచేసిన స్థానాల్లోనూ పోస్టింగ్‌లు కేటాయిస్తూ ఉమ్మడి జిల్లా స్థాయిలో సర్వీసు పరమైన వ్యవహారాలు చూసే విశాఖ డీఈవో ఎల్.చంద్రకళ ఈ నెల 13న ఆదేశాలు ఇచ్చారు. 2024–25 విద్యా సంవత్సరానికి 1998, 2008 డీఎస్సీల వారికి కలిపి కౌన్సెలింగ్ ప్రాతిపదికన పోస్టింగ్ ఇస్తారని అంతా భావించినా, ఏ ఒక్కరూ తమ గోడు పట్టించుకోకపోవటం సరైంది కాదని ఉపాధ్యాయులు అంటున్నారు. ప్రస్తుతం డీఎస్సీ కోసం ఖాళీల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నందున గత ఏడాది ఇచ్చిన ఉత్తర్వులకు అనుగుణంగా సొంత గ్రామాలకు దగ్గరలో ఉన్న ఖాళీల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

సహనాన్ని పరీక్షిస్తే చూస్తూ ఊరుకోం

మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు


సమావేశానికి హాజరైన వైఎస్సార్ సీపీ నాయకులు


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, పక్కన మాజీ ఎమ్మెల్సీ సూర్యనారాయణ రాజు

కోటవురట్ల: అధికారంలోకి వచ్చామని విర్రవీగుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడితే చూస్తూ ఊరుకోమని మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు హెచ్చరించారు. గెలుపోటములు సహజమని, ప్రజల తీర్పును గౌరవిస్తూ ప్రజల తరపున సమస్యలపై పోరాడతామని చెప్పారు. తంగేడులోని మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు నివాసంలో వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలతో శనివారం సమావేశం నిర్వహించి ఓటమిపై సమీక్షించారు. కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు కిల్లాడ శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా పలువురు పార్టీ నాయకులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ఎవరూ ఊహించని రీతిలో వచ్చాయని, ప్రజలకు ఇంత సంక్షేమాన్ని అందించినా లోపం ఎక్కడ జరిగిందో అర్థం కాలేదన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అలవికాని హామీలతో ప్రజలను మోసం చేయలేక నిజాయితీగా ఓటు అడిగారన్నారు. దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చి దేశంలోనే ఉత్తమ పాలన అందించారని తెలిపారు. అయితే టీడీపీ నాయకులు ల్యాండ్ టైటిలింగ్ యాక్టు పేరు చెప్పి వారి ఆలోచనలను విషపూరితం చేశారన్నారు. ఏది ఏమైనా ఓటమి మరింత బలాన్ని ఇస్తుందని, అధికార పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే పోరాటం సాగిస్తామని తెలిపారు. తనకు లాయర్‌గా అనుభవం ఉందని, పార్టీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ నాయకుల ఆగడాలకు ఎవరైనా ఇబ్బందులకు గురైతే వారికి దన్నుగా ఉండడమే కాకుండా న్యాయపరంగా కూడా అండగా ఉంటానన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఎక్కడా అరాచకాలు, దోపిడీలు చేయలేదని, టీడీపీ నాయకులపై దాడులు కాని, పోలీసు కేసులు కాని పెట్టిన దాఖలాలు లేవన్నారు. కానీ ఇపుడు టీడీపీ అధికారంలోకి రాగానే రాష్ట్రం అంతటా దాడులు జరుగుతున్నాయని, శాంతిభద్రతలు ప్రశ్నార్థకంగా మారాయని తెలిపారు. టీడీపీ ఆగడాలను అడ్డుకుంటామని కార్యకర్తలు, నాయకులు ధైర్యంగా ఉండాలని చెప్పారు.

మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రానున్న రోజుల్లో అధికార పార్టీ నాయకులు.. వైఎస్సార్ సీపీ సర్పంచులు, ఎంపీటీసీల అధికారాన్ని లాక్కోవడానికి ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమన్నారు. మళ్లీ స్థానిక సంస్థ ఎన్నికలు జరిగితే మండలంలో వైఎస్సార్ సీపీ సత్తా చూపిస్తామని తెలిపారు. కోటవురట్ల మండలం వైఎస్సార్ సీపీకి కంచుకోటగా నిరూపిస్తామని శపథం చేశారు. తంగేడు రాజకుటుంబీకులంతా కార్యకర్తలకు అండగా ఉంటూ పూర్వ వైభవాన్ని తీసుకొస్తామన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు జరిగితే వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, అక్కడా చట్టపరంగా న్యాయం జరగకపోతే ప్రైవేటు కేసులు పెట్టి న్యాయస్థానంలో పోరాడతామని తెలిపారు. అందుకు అయ్యే ఖర్చును తామే భరిస్తామని స్పష్టం చేశారు. ఈ రెండేళ్లు సర్పంచులు, ఎంపీటీసీలు ప్రతి అంశం పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్, జిల్లా కార్యదర్శి యల్లపు కుమారరాజా, వైఎస్సార్ సీపీ నాయకుడు సిద్ధాబత్తుల సత్యనారాయణ మాట్లాడారు. పార్టీ నాయకులు సత్యనారాయణరాజు, శింగంపల్లి కిషోర్, మాజీ జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

బంగారం, వెండి, నగదు చోరీ

కోటవురట్ల: మండలంలోని కన్నూరుపాలెంలో సుమారు రూ.మూడు లక్షల విలువైన బంగారు, వెండి నగలు, నగదు చోరీకి గురయ్యాయి. సీఐ ఎం.వినోద్‌బాబు శనివారం అందించిన వివరాల ప్రకారం...కన్నూరుపాలెంలో నివాసముంటున్న బొడ్డు కాశీ విశ్వేశ్వరరావు తన కుమారుడిని లాంగ్ టర్మ్ కోచింగ్‌లో చేర్పించడానికి ఈ నెల 12న భార్యతో కలిసి ఇంటి నుంచి విజయవాడ వెళ్లారు. వారు లేని సమయంలో దొంగలు ఇంటిలోకి ప్రవేశించి, రెండు బీరువాలు తెరచారు. వాటిలో ఉన్న రూ.90 వేల నగదు, రెండు తులాల బంగారు గొలుసు, 1200 గ్రాముల వెండి వస్తువులు తస్కరించారు. విశ్వేశ్వరరావు శుక్రవారం రాత్రి తిరిగి ఇంటికి చేరారు. ప్రవేశ ద్వారాల తాళాలు పగులగొట్టి, తెరచి ఉన్నాయి. ఇంట్లో తెరిచి ఉన్న రెండు ఇనుప బీరువాలను పరిశీలించగా రూ.90 వేల నగదు, రెండు తులాల బంగారు గొలుసు, మూడు జతల చెవి ఆభరణాలు చోరీ అయినట్టు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదుపై మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. క్లూస్ బృందం, డాగ్ టీం ఆ ఇంటిని పరిశీలించాయి. సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలను తనిఖీ చేశారు.

'స్కిల్'ఇన్‌స్టిట్యూట్‌తో ఏపీ చాంబర్స్ ఎంవోయూ

ఎంవీపీకాలనీ(విశాఖ): నగరంలోని స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌తో ఏపీ చాంబర్స్ విశాఖపట్నం ఎంవోయూ కుదుర్చుకుంది. ఈ మేరకు ఇరుసంస్థల ప్రతినిధులు ఎంవీపీకాలనీలో శనివారం జరిగిన కార్యక్రమంలో ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఎంవోయూలో భాగంగా విద్యార్థులు, ట్రైనీల్లో నైపుణ్యం, ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు ఏపీ చాంబర్స్ సేవలందిస్తుంది. ఏపీ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ తన సభ్య పరిశ్రమల ద్వారా ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లు, పలు కోర్సుల్లో యువతకు శిక్షణ ఇవ్వనుంది. ఎస్‌డీఐ సీఈవో ఇంతియాజ్ అర్షద్, ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ విశాఖ జోన్ చైర్మన్ శ్రీనాథ్ చిట్టూరి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో 5 లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు


దేవరాపల్లిలో ఆయిల్‌పామ్ సాగును పరిశీలిస్తున్న పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మల్లేశం

దేవరాపల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దేశ వ్యాప్తంగా ఐదేళ్లలో ఐదు లక్షల హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మల్లేశం పూల చెప్పారు. దేవరాపల్లిలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటలను తన బృందంతో కలిసి శనివారం పరిశీలించారు. సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అధిక దిగుబడులు సాధించేందుకు మెలకువలను ఆయన రైతులకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో 80 శాతం, తెలంగాణలో 15 శాతం, మిగిలిన రాష్ట్రాల్లో 5 శాతం ఆయిల్‌పామ్‌ను సాగు చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం పెద్దాపురం, కృష్ణాపురంలలో పామాయిల్ నూనె శుద్ధి కార్మాగారాలు ఉన్నాయన్నారు. తమ కొనుగోలు కేంద్రంలో గెలలు విక్రయించిన 14 రోజుల్లో రైతుల ఖాతాల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధర ఆధారంగా నగదు జమ చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం టన్ను ఆయిల్‌పాం ధర రూ.13,284 ఉందని తెలిపారు. రైతుల వినతి మేరకు అదనంగా ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట సంస్థ జనరల్ మేనేజర్ టి.రమణ, అసోసియేషన్ జనరల్ మేనేజర్ పట్టాభి రామిరెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్ తదితర సిబ్బంది ఉన్నారు.

18న మోదకొండమ్మ పండగ


మోదకొండమ్మను రంగులతో తీర్చిదిద్దిన దృశ్యం

మాడుగుల: మండల కేంద్రం మాడుగులలో ఈ నెల 18 న మోదకొండమ్మ పండగను ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆలయంతో పాటు అమ్మవారి విగ్రహాన్ని రంగులతో తీర్చిదిద్దారు. ఆలయం నుంచి సతకం పట్టు వరకు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. చిటికెల భజనలు, బళ్ల వేషాలు, ఖవాలీ నృత్యాలు, నేల వేషాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సంబరాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ అప్పల రాజు తెలిపారు. పంచాయతీ ఈవో నాయుడు ఆధ్వర్యంలో వీధుల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సారి అమ్మవారిని దర్శించుకోవడానికి లక్షమంది భక్తులు వస్తారని ఆలయ కమిటీ అంచనా వేసింది. ఆ దిశగా ఏర్పాట్లు చేస్తోంది.

స్టేట్ క్వాలిటీ అండ్ కంట్రోల్ అధికారుల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న స్టేట్ క్వాలిటీ అండ్ కంట్రోల్ అధికారులు ఇస్మాయిల్, శకుంతల

రోలుగుంట: మండలంలోని నాయుడుపాలెం పాఠశాలను శనివారం స్టేట్ క్వాలిటీ అండ్ కంట్రోల్ అధికారులు తనిఖీ చేశారు. పాఠశాలలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని స్టేట్ అబ్జర్వర్ ఇస్మాయిల్ తెలిపారు. అనంతరం రోలుగుంట హైస్కూల్‌లో పాఠశాలలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు, స్టూడెంట్ కిట్‌లను తనిఖీ చేసిన ఇస్మాయిల్, సీఎంవో శకుంతల సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలల ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలను పంపిణీ చేసేలా చర్యలు తీసుకున్న ఎంఈవోలు జాన్ ప్రసాద్, జగ్గారావును అభినందించారు.

ఉక్కు కేవీలో ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కేంద్రీయ విద్యాలయంలో ఈ నెల 18,19 తేదీల్లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలకు వాక్‌ఇన్‌ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ వంశీకృష్ణ తెలిపారు. 18న పీజీటీ విభాగంలో ఇంగ్లిష్, హిందీ, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, కామర్స్, ఎకనామిక్స్ ఉపాధ్యాయులకు, టీజీటీ విభాగంలో ఇంగ్లిష్, హిందీ, సంస్కృతం,గణితం,సైన్స్,సోషల్ సైన్స్ సబ్జెక్టులకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. 19న పీఆర్‌టీ, పీజీటీలో కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, డాన్స్ కోచ్, స్పోర్ట్స్ కోచ్, స్పెషల్ ఎడ్యుకేటర్, యోగా ఇన్‌స్ట్రక్టర్, ఎడ్యుకేషనల్ కౌన్సిలర్, నర్స్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అర్హులైన అభ్యర్థులు అన్ని ధ్రువీకరణపత్రాలతో ఆయా తేదీల్లో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. ఉదయం 8.30 గంటల నుంచి వరకు దరఖాస్తుల స్వీకరణ అనంతరం ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. పూర్తి వివరాలకు విద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

విశాఖ విమల విద్యాలయంపై కొనసాగుతున్న చర్చలు

ఉక్కునగరం: స్థానిక విశాఖ విమల విద్యాలయం కొనసాగింపుపై చర్చలు కొనసాగుతున్నాయి. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, నాయకుల మధ్య జరిగిన చర్చల్లో వారు తమ అభిప్రాయాలు తెలిపారు. పాఠశాల యాజమాన్యం ఇచ్చిన హామీ మేరకు శనివారం ఉదయం మూడు వర్గాల వారు హాజరయ్యారు. పాఠశాల యాజమాన్య ప్రతినిధులు మాట్లాడుతూ తాము ఆర్థిక భారం భరించలేమని, ఉక్కు యాజమాన్యం పాత పద్ధతిలో కొనసాగించడమో లేక ఉపాధ్యాయులు తమ జీతాలు తగ్గించుకోవడమో చేయాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు తమ సర్వీస్ రూల్స్‌పై కొంతమేర తగ్గారు. వేతనాలు, పీఆర్సీ, పాత బకాయిల చెల్లింపు తదితర అంశాలపై తమఅభిప్రాయాన్ని వెల్లడించారు. నాయకులు మాట్లాడుతూ జీతాలు తగ్గించడం అన్యాయమన్నారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయుల అభిప్రాయాలను ఉక్కు యాజమాన్యానికి వివరించి, వారికి నచ్చచెబుతామని హామీ ఇచ్చారు.

సంపత్ వినాయగర్ హుండీ ఆదాయం రూ.18.28 లక్షలు

సీతమ్మధార(విశాఖ): ఆశీలమెట్టలోని సంపత్ వినాయగర్ హుండీల ఆదాయం లెక్కింపు ప్రక్రియ శనివారం దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఈవో కె.శిరీషా ఆధ్వర్యంలో జరిగింది. మొత్తం 28 రోజులకు గానూ రూ.18,28,509 వచ్చినట్లు ఈవో తెలిపారు. అలాగే 228 గ్రాముల వెండి, 27 యూఎస్‌ఏ డాలర్లు, 20 సింగపూర్ డాలర్లు, 20 థాయ్ బాట్‌లు, 6 మలేషియా రింగిట్‌లు వచ్చినట్లు వెల్లడించారు. దేవదాయ శాఖ తనిఖీదారులు జి.వి.రమాబాయి, ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ టి.చోళన్ పర్యవేక్షణలో శివజ్యోతి, వేంకటేశ్వర సేవా సంఘం సభ్యులు లెక్కించారు. ఆలయ సిబ్బంది జి.గోవిందరెడ్డి, డి.ఎస్.ప్రసాద్, యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శివపార్వతుల కల్యాణోత్సవం రేపు

కశింకోట: స్థానిక కుమ్మరి వీధిలో గల ఉమా సాంబశివుని ఆలయంలో ఈ నెల 17న శివ పార్వతుల కల్యాణోత్సం నిర్వహించనున్నట్టు అర్చకుడు వేయిదళముల ప్రసాద్ తెలిపారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించనున్నట్టు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొవాలని కోరారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్న బాలికలు

కశింకోట: స్థానిక బాలికల హైస్కూల్‌లో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం జరిగింది. హెచ్‌ఎం ఎం.ఎస్. స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిలో పాము కలకలం

తుమ్మపాల: జిల్లా (ఎన్టీఆర్) ఆస్పత్రిలో శనివారం పాము కలకలం సృష్టించింది. ఆస్పత్రి పరిసరాల్లో డ్రైనేజీ కాలువ నుంచి చిన్నపాటి పాము రోడ్డు మీదుగా ఆస్పత్రిలోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. అక్కడ ఉన్న ప్రజలు కేకలు చేయడంతో ఆస్పత్రి సిబ్బంది అప్రమత్తమై దానిని చంపి బయటపడేశారు.

టీకాలతో చిన్నారుల్లో వ్యాధి నిరోధకశక్తి పెంపు



టీకాలను వేస్తున్న వైద్య సిబ్బంది సంతోషికుమారి

కె.కోటపాడు: ఐదేళ్ల లోపు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను వేయడం వల్ల వారిలో వ్యాధులను ఎదుర్కొగలగే శక్తి సమకూరుతుందని లంకవానిపాలెం పీహెచ్‌సీ హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్ తెలిపారు. శనివారం ఎ.కోడూరు, వారాడ గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఎ.కోడూరులో 19 మంది, వారాడలో 13 మంది చిన్నారులకు టీకాలు వేశారు. రెండు గ్రామాల్లో 12 మంది గర్భిణులకు ధనుర్వాతం సోకకుండా టీకాలు వేశారు. ఏఎన్‌ఎం సంతోషికుమారి, ఎంఎల్‌హెచ్‌పీ శాంతి తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మహారాజ	: రాజా
మనమే	: సత్యనారాయణ స్క్రీన్-1
మ్యూజిక్‌షాప్ మూర్తి	: సత్యనారాయణ స్క్రీన్-2
భజే వాయు వేగం	: షిర్డిసాయి
లవ్ మౌళి	: పర్తిసాయి
సత్యభామ	: వెంకటేశ్వర
గ్యాంగ్ ఆఫ్ గోదావరి	: శ్రీసత్య
హరోం హర	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 275 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,700	4,950
రెండో రకం	4,000	4,550
మూడో రకం	3,510	3,970

రక్త నిల్వలు

తుమ్మపాల: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 38 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-19 యూనిట్లు, బి పాజిటివ్- 5 యూనిట్లు, ఒ పాజిటివ్- 13 యూనిట్లు, బి నెగిటివ్ ఒక యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706) ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శనివారం 355 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 311 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ (0892 4223595)ని సంప్రదించవచ్చు.

అధ్వానంగా ఉగ్గినపాలెం రోడ్డు

- శిథిలావస్థకు చేరిన రహదారి
- అడుగడుగునా గోతులు,గతకలతో అవస్థలు
- నిర్మించాలని గ్రామస్తుల వేడుకోలు



రోడ్డుపై గోతులు



శిథిలావస్థకు చేరిన ఉగ్గినపాలెం రోడ్డు

కశింకోట: మండలంలోని ఉగ్గినపాలెం గ్రామానికి వెళ్లే రోడ్డు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రజలు, వాహన చోదకులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. యలమంచిలి-అనకాపల్లి మార్గంలో మారుమూలన ఈ గ్రామం ఉంది. ఈ ఊరిలో సుమారు 2800 మంది నివశిస్తున్నారు. జాతీయ రహదారి నుంచి గ్రామానికి కిలో మీటరు పైగా దూరం ఉంటుంది. రోడ్డు సరిగా లేకపోవడంతో రాకపోకలు సాగించాలంటే నిత్యం నరకయాతన అనుభవించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. రోడ్డు నిండా గోతులు,గతకలు ఉండడంతో వాహన చోదకులు ఏ మాత్రం అజాగ్రత్తగా వెళ్లినా ప్రమాదాల బారిన పడక తప్పని పరిస్థితి. వర్షం పడిందంటే మరింత ప్రమాదభరితంగా ఉంటోంది. గోతుల్లో వాహనాలు పడి పలువురు ప్రమాదాలకు గురయ్యారు. ఈ గ్రామానికి ఆటోలు నడిపేందుకు డ్రైవర్లు ముందుకు రాకపోవడం వల్ల ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కాలి నడకన చేరుకోవలసి వస్తోంది. పలుసార్లు రోడ్డు నిర్మాణానికి ప్రయత్నాలు జరిగినా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదని అధికారులు తెలిపారు.

జాతీయ ఉపాధి హామీ పథకంలో కూడా రూ.25 లక్షలతో సిమెంట్ రోడ్డు మంజూరైంది. ఈ నిధులు ఎన్నికల సమయంలో రావడంతో పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాలేదని అధికారులు తెలిపారు. తమ ఇబ్బందుల దృష్ట్యా రోడ్డును నిర్మించడానికి అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

రాకపోకలకు నరకయాతన



ఉగ్గినపాలెం రోడ్డు గతుకులతో నిండి అధ్వానంగా ఉంది. రాకపోకలు సాగించడానికి నిత్యం నరకయాతన అనుభవిస్తున్నాం. అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. రోడ్డును పునర్నిర్మించి, కష్టాల నుంచి గట్టెక్కించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

–యలమర్తి గణేష్, ఉగ్గినపాలెం.

రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి



ఉగ్గినపాలెం రోడ్డు గతుకులతో నిండి ఉండడం వల్ల వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. వర్షం పడిదంటే చాలు ఎక్కడ గొయ్యి ఉందో తెలియక వాహనాలు వాటిలో పడి దెబ్బతింటున్నాయి. చేతి చమురు వదులుతోంది. రోడ్డు నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కర్రి శ్రీనివాసరావు, వ్యాన్ డ్రైవర్, ఉగ్గినపాలెం.

కాంట్రాక్టర్లు ముందుకు రానందునే..

ఉగ్గినపాలెం రోడ్డు పునర్నిర్మాణానికి పలు ప్రయత్నాలు జరిగాయి. తాజాగా ఉపాధి హామీ పథకం కింద రూ.25 లక్షలతో సిమెంట్ రోడ్డు ఎన్నికల సమయంలో మంజూరైనప్పటికీ ఎవరూ ముందుకు రాకపోవడంతో పనులు చేపట్టలేదు.

–లక్ష్మణరావు,
మండల ఇంజినీర్,కశింకోట.

రేపటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు



ధ్యాన వేంకటేశ్వరస్వామి

కశింకోట: స్థానిక వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరంలో ఈ నెల 17 నుంచి రెండు రోజులపాటు స్వామి వారి 7వ వార్షిక కల్యాణోత్సవాలను నిర్వహించడానికి సన్నాహాలు చేసినట్టు అర్చకుడు రేజేటి శ్రీరామచరణాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా మొదటి రోజు జ్యేష్ట శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో ఉదయం 9 గంటలకు స్వామి వారికి అభిషేకం, విశేష అర్చన, సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలకు వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవాన్ని జరిపించనున్నట్టు తెలిపారు.

ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు, వేణుగోపాలస్వామి ఆలయ అర్చకులు రేజేటి సీతారామాచార్యులు, రేజేటి మారుతి, గోప అప్పలాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈనెల 18న సాయంత్రం 6 గంటలకు గరుడ సేవ (తిరువీధి సేవ) జరపనున్నట్టు తెలిపారు.

దోమల నివారణకు చర్యలు



మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలో పాల్గొన్న గ్రామస్తులు

తుమ్మపాల: దోమల వల్ల మలేరియా తదితర వ్యాధులు వ్యాపిస్తున్నాయని, వాటి నివారణకు అందరూ కృషి చేయాలని తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ సమీమ్ అన్నారు. మండలంలో రేబాక పంచాయతీ కాపుశెట్టివానిపాలెంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ వరకు ప్రతి గ్రామంలో మలేరియా నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. నిల్వ ఉన్న నీటిని తొలగించి, పాత్రలను శుభ్రం చేసుకోవాలన్నారు. కొబ్బరి బొండాలు, డ్రమ్ముల్లో నీటిని తొలగించాలని సూచించారు. దోమల కారణంగా మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ తదితర విషజ్వరాలు విజృంభిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ బి.సంగం, ఏఎన్‌ఎం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో దోమల నివారణ మందు పిచికారీ



తేగాడ వసతి గృహంలో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

కశింకోట: మండలంలోని ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులు మలేరియా, డెంగ్యూ వ్యాధుల బారిన పడకుండా దోమల నివారణ మందును శనివారం పిచికారీ చేశారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా కశింకోట, తేగాడ గ్రామాల్లో ఉన్న సమగ్ర బాలికల వసతి గృహం, బీసీ వసతి గృహం , బాల సదనం, తేగాడలోని ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలల్లోని వసతి గృహాల్లో కశింకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో దోమల నివారణ మందు పిచికారీ చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవోలు పరమానందరావు, శ్రీనివాసరావు, సూపర్ వైజర్లు,ఎంఎల్‌హెచ్‌పీలు, హెచ్‌ఎలు, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్యాధికారి తిరుపతిరావు ప్రజలకు అవగాహన కల్పించారు. దోమలు మంచి నీరు నిల్వ ఉన్నచోట గుడ్లు పెట్టి అభివృద్ధి చెందుతాయన్నారు.

దీనిదృష్ట్యా అవి పెరగకుండా ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, నీరు నిల్వ చేసే పాత్రలను వారానికి ఒకసారి ఖాళీ చేయాలన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. దోమ తెరలువినియోగించాలన్నారు. జ్వరం వస్తే రక్త పరీక్షలు, చికిత్స చేయించుకోవాలన్నారు.

మహాకవి శ్రీశ్రీకి ఘన నివాళులు



అనకాపల్లిలోని ఏఐటీయూసీ కార్యాలయంలో మహాకవి శ్రీశ్రీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కశింకోట: మహాకవి శ్రీశ్రీకి శనివారం పలువురు ఘనంగా నివాళులర్పించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యాలయం(అనకాపల్లి)లో శ్రీ శ్రీ 41వ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ మహాకవి శ్రీశ్రీ సమాజాన్ని ప్రభావితం చేసే విధంగా ఎన్నో రచనలు చేశారన్నారు. ఆయన రచనలు శ్రమ జీవుల గొంతుకగా మారాయని చెప్పారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కండేపల్లి త్రినాథ్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల సంఘం ప్రతినిధి వి.పోతురాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జీ, కార్యదర్శి జి. ఫణీంద్ర కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాజు, తదితరులు పాల్గొన్నారు.

వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయం

దేవరాపల్లి: పెదనందిపల్లి వాసవి క్లబ్ సేవలు ప్రశంసనీయమని అంతర్జాతీయ వాసవి క్లబ్ అధ్యక్షుడు కె.రవిచంద్రన్ కొనియాడారు. జమ్మాదేవిపేట జంక్షన్ సమీపంలో నూతనంగా నిర్మించిన వాసవీ మాత ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అంతకు ముందు వాసవీమాతను దర్శించుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ప్రపంచ వ్యాప్తంగా వాసవి క్లబ్ సేవల విస్తరించామని, మానవ సేవే-మాధవ సేవ నినాదానికి సార్థకత చేకూర్చేలా ప్రతీ సభ్యుడు సేవా స్ఫూర్తితో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ వై. నర్సింగరావు, జోన్ చైర్మన్ పి. రామకృష్ణ, వాసవి క్లబ్, వనితా క్లబ్ సభ్యులు నాగఅప్పారావు, శ్రీనివాసరావు, రాజు, రోహిణి, లావణ్య, సాయిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఫుట్‌పాత్ బ్రిడ్జి



కూలుతున్న పుట్‌పాత్ బ్రిడ్జి

ఎస్.రాయవరం : మండలంలో కొరుప్రోలుపెద చెరువు వద్ద కలింగల్ కాలువపై పుట్‌పాత బ్రిడ్జి ప్రమాదకరంగామారింది. కొన్నేళ్లుగా శిథిలావస్థకు చేరుకున్న సంగతి తెలిసిందే. ఆ బ్రిడ్జి ఇప్పుడు కూలడం ప్రారంభం అయ్యింది. దీంతో ప్రమాదకరంగా మారింది.నిత్యం ఈ బ్రిడ్జి మీద పాదాచారులు, ద్విచక్ర వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ బ్రిడ్జి పై నిత్యం కొరుప్రోలు, గెడ్డపాలెం గ్రామాలకి చెందిన వారు రాకపోకలు సాగిస్తుంటారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంతో వ్యవసాయ కూలీలు, రైతులు రాకపోకలు మరింతగా పెరిగాయి. బ్రిడ్జిపై నుంచి నడిచే సమయంలో ఏమాత్రం కూలినా పెద్ద ప్రమాదం తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి స్వల్ప వ్యయంతో నిర్మాణం అయ్యే బ్రిడ్జిని పునర్ నిర్మాణంచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన బోధన

కొరువాడ హైస్కూల్‌ను తనిఖీ చేసిన ఎంపీడీవో, ఎంఈవో



మాట్లాడుతున్న ఎంపీడీవో పట్నాయక్, ఎంఈవో సత్యనారాయణ

కె.కోటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉండడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన చదువులు అందుతున్నాయని ఎంపీడీవో పట్నాయక్ తెలిపారు. కొరువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శనివారం ఆయన ఎంఈవో సత్యనారాయణతో కలిసి ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన విద్యా కిట్లు వెంటనే అందజేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన చదువుతో పాటు అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందన్నారు. వారి తల్లిదండ్రులకు వివరించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలని ఎంఈవో తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని రోజూ మెనూ ప్రకారం ఉండేలా ఎప్పటికప్పుడు ఉపాధ్యాయ సిబ్బంది పర్యవేక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.కమలా కుమారి తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా సాగునీటి కాలువ



ఉమ్మలాడలో అధ్వానంగా సాగునీటి కాలువ

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో సాగునీటి కాలువ అధ్వానంగా ఉంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సాగునీటి కాలువ గుండా మురుగు నీరు ప్రవహిస్తుంది. పంట పొలాలకు అవసరమయ్యే సాగునీరు ప్రవహించే పరిస్థితులు కనిపించడం లేదు. ఎగువ నుంచి వచ్చే నీటి ఆధారంగా దిగువ స్థాయి పంటల సాగు జరుగుతుండేది. అయితే అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంట పొలాలకు నీరు అందే పరిస్థితులు కనిపించడం లేదు. ఇప్పటి కైనా ఉన్నతాధికారులు స్పందించి సాగునీటి కాలువల ద్వారా నీరు ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గిరిజన బాలుర పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

మాడుగుల రూరల్: మండలంలో నర్సయ్యపేట(దిబ్బూరు) గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో ఖాళీ సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బావరాజు అప్పారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు ఐదో తరగతి వరకు 20 సీట్లు చొప్పున, ఆరో తరగతిలో 40, ఏడో తరగతిలో 23, ఎనిమిదో తరగతిలో 12 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కేటగిరీ విద్యార్థులకు 10 శాతం రిజర్వేషన్ ప్రకారం వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 8688525042 సంప్రదించాలన్నారు.

మడుతూరు హైస్కూల్ ఆకస్మిక తనిఖీ



మడుతూరు ఉన్నత పాఠశాలలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీఈవో వెంకట లక్ష్మమ్మ

అచ్యుతాపురం : మండలంలోని మడుతూరు ఉన్నత పాఠశాలను డీఈవో వెంకట లక్ష్మమ్మ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల హాజరు తీరుపై ఆరా తీశారు. ఉపాధ్యాయులు ఉపయోగిస్తున్న యాప్‌ల గురించి తెలుసుకున్నారు. విద్యార్థుల గైర్హాజరు లేకుండా చూసుకోవాలని సూచించారు. తరగతి గదులను పరిశీలించారు. ట్యాబ్, ఐఎఫ్‌పీ ప్యానల్స్ పనితీరు ఎలా ఉందని ప్రశ్నించారు. మంచి ఫలితాలు వచ్చేలా ఇటు ఉపాధ్యాయులు కృషి చేయడంతో పాటు, అటు విద్యార్థులు చక్కగా అభ్యసించాలని కోరారు. ఎంఈవో దేవరాయలు పాల్గొన్నారు.

ఘనంగా రాధాకృష్ణుల తీర్థం



కె.జె.పురంలో రాధాకృష్ణులను దర్శించుకుంటున్న భక్తులు

మాడుగుల రూరల్: కె.జె.పురం –దబ్బకుంటు రహదారిలో రాపేట వారి కళ్లాల వద్ద రాధాకృష్ణుల తీర్థం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామస్తులతోపాటు ఎం. కోటపాడు, వల్లాపురం, వంటర్లపాలెం, ఘాట్‌రోడ్డు, తదితర చోట్ల నుంచి వచ్చిన భక్తులు అన్నసమారాధనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద మహిళల కోలాటం ఆకట్టుకుంది. సాయంత్రం వర్షం కురవడం వల్ల ఎడ్ల పరుగు పోటీలు రద్దు చేశారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

కట్టుబోలులో నవదుర్గ ఆలయ వార్షికోత్సం నేడు



కట్టుబోలులో నవదుర్గ అమ్మవారు

రాంబిల్లి : కట్టుబోలులో ఆదివారం నవదుర్గ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు నిర్వాహక కమిటీ ప్రతినిధి నక్కా నాగేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. 20 ఏళ్ల క్రితం శారద నది ఒడ్డు సమీపంలో మట్టిని తవ్వుతుండగా అమ్మవారి విగ్రహం బయటపడింది. అప్పటి నుంచి అమ్మవారిని భక్తులు పూజిస్తారు. దాతల సాయంతో అమ్మవారి ఆలయం నిర్మించారు. మరో భారీ విగ్రహం ప్రతిష్టించారు. పక్కనే స్వయంభూగా వెలసిన అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్టించారు. 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. భజనలు, కోలాటాలు వంటి కార్యక్రమాలను పాటు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కోరిన కోర్కెలు తీర్చె కల్పవల్లిగా భక్తులు నవదుర్గ అమ్మవారిని నమ్ముతారని ఈ గ్రామానికి చెందిన డీవీ సన్యాసయ్య తెలిపారు.